

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.5,47,386

బంగారం 11 గ్రాముల 800 మిల్లీ గ్రాములు

వెండి 397 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



గంజాయి స్వాధీనం

ఒక పికప్ వ్యాన్‌లో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను చంద్రపూర్ పోలీసులు పట్టుకున్నారు.

- 8లో



వైద్య రంగానికి పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందని నవరంగపూర్ ఎంపీ బలభద్ర మాఝి అన్నారు.

- 8లో

నవీన వ్యూహం..!

- ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా బీజేడీ చర్యలు
- ఎన్నికల హామీలపై ప్రజాక్షేత్రంలోకి
- అక్టోబర్ 2 నుంచి జన సంపర్క్ యాత్ర



నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్ర రాజకీయాల్లో విపక్ష నేతగా నవీన్ పట్నాయక్ సరికొత్త ఉనికిని ఆవిష్కరించే దిశలో అడుగులు వేస్తున్నారు. ఎన్నికల సీజన్‌ను కంటే అధికంగా ప్రజా సంబంధాల పరిరక్షణ కోసం విశేషంగా శ్రమిస్తున్నారు. ప్రధానంగా ప్రచారం సందర్భంగా బీజేపీ ప్రసారం చేసిన ఎన్నికల హామీల వాస్తవ కార్యాచరణపై గట్టి నిఘా వేసి ప్రజా స్పందనని రంగరిస్తున్నారు. హామీల కార్యాచరణ సాధ్యాసాధ్యాల్ని సామాన్య ప్రజానీకం దృష్టికి తీసుకెళ్లేందుకు వ్యూహం ఖరారు చేశారు. దీనిలో భాగంగా బిజూ జనతా దళ్ సంప్రదాయం ప్రకారం ఏటా మాదిరిగా ఈ ఏడాది కూడ జన సంపర్క్ పాదయాత్ర కొనసాగించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో గాంధీ జయంతి పురస్కరించుకుని అక్టోబర్ 2 నుంచి ఈ యాత్ర ప్రారంభించనున్నారు. బిజూ జనతా దళ్ పాదయాత్ర 2 విడతల్లో నిర్వహిస్తారు. తొలి విడత అక్టోబర్ 2న ప్రారంభమై అక్టోబర్ 6న ముగుస్తుంది. దసరా ఉత్సవాల అనంతరం అక్టోబర్ 21 నుంచి అక్టోబర్ 30 వరకు జన సంపర్క్ యాత్ర కొనసాగనుంది. విభిన్న శైలిలో రాష్ట్ర ప్రభుత్వ పాలన తీరుని ప్రజల మధ్య ఎండగట్టడమే ఈ యాత్ర లక్ష్యంగా స్పష్టం అవుతుంది. ప్రభుత్వ పాలన వైఫల్యాల్ని విశ్లేషించకుండా వర్తమాన పరిస్థితుల్లో ప్రజలు ఆశిస్తున్న పాలన శైలి, హామీల వాస్తవ కార్యాచరణ అసాధ్యత, వనరుల కొరత, భావి పరిణామాల తీవ్రతని సగటు ఓటరు దృష్టికి తీసుకుని వెళ్లేందుకు కార్యకర్తల్ని వ్యూహాత్మకంగా రంగంలోకి దింపనున్నారు.

అంతః కలహాలపై నిఘా

బీజేడీ శిబిరంలో అసంతృప్తులు, అంతః కలహాల సెగ పెచ్చు మీరకుండా నవీన్ పట్నాయక్ అత్యంత జాగరూకతతో వ్యవహరిస్తున్నారు. ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ వైఫల్యంపై అనుభవజ్ఞులైన సీనియర్ సభ్యుల అభిప్రాయాలకు పట్టం గడుతున్నారు. ఇంతకు ముందు బీజేడీ ప్రధాన నాయకులుగా వెలుగొందిన వారి పరపతిపై శీతకన్ను వేసి మరుగున పడేసిన ప్రముఖుల్ని తెరకి ఎక్కించి ప్రజా క్షేత్రంలోకి ప్రేరేపిస్తున్నారు. సంస్థాగతంగా బీజేడీ పూర్వ సత్తా పునరుద్ధరణతో క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య బీజేడీపై అభిప్రాయం, మనోగతాల్ని పసిగట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

జిల్లా నాయకులతో సమావేశాలు

బిజూ జనతా దళ్ రాష్ట్ర శాఖల ప్రముఖులతో నవీన్ పట్నాయక్ తరచూ స్థానిక శంఖ భవన్‌లో ప్రత్యక్షంగా సమావేశమవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బీజేడీ జన సంపర్క్ యాత్ర జయప్రదం చేయాలని పిలుపునిస్తున్నారు. సమావేశం పురస్కరించుకుని ప్రాంతాలవారీగా తాండవిస్తున్న సమస్యలు, కొత్త ప్రభుత్వ పాలన తీరుతో దారి తప్పుతున్న ప్రజా సేవల వ్యవస్థ, సమాజంలో కనీస భద్రత, రక్షణ హామీ వంటి అంశాలపై సామాన్య ప్రజలను చైతన్యపరిచేందుకు ప్రబోధిస్తున్నారు. అలాగే ప్రజాదరణ బలోపేతం దిశలో బీజేడీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఖరారు చేశారు. అక్టోబర్ 9 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

విపక్ష హోదాలో ప్రజా పోరాటం

సుదీర్ఘ పాలనకు అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రజానీకానికి తాజా పరిణామాల నేపథ్యంలో విపక్ష హోదాలో బీజేడీ తన వంతు దక్షతని ప్రతిబింబించాలని నవీన్ పట్నాయక్ కార్యకర్తలను ప్రోత్సహిస్తున్నారు. ఈ మేరకు సరికొత్తగా 3 కమిటీలు ఏర్పాటు చేశారు. వీటిని సలహా కమిటీ, సభ్యత్వ నమోదు కమిటీ, కార్యక్రమాల ఆచరణ కమిటీగా పేర్కొన్నారు. ఈ కమిటీల్లో వివాదస్పద ముందంజ నాయకులను దూరం చేశారు. పార్టీ వైఫల్యంపై తీవ్ర మనస్తాపం వ్యక్తం చేసిన వారికి అగ్ర తాంబూలం అందజేశారు. ప్రజాహితం కోసం అమలు చేసిన బీజేడీ పథకాలతో హామీల మేరకు బీజేపీ ప్రభుత్వం కొత్త పథకాలు సమాంతరంగా కొనసాగించేలా విపక్ష పాత్ర పోషించేందుకు జన సంపర్క్ యాత్రలో ప్రజాభిప్రాయ సేకరణకు బీజేడీ సేన రంగంలోకి దిగుతోంది. బీజేడీ కార్యవర్గంలో కొత్త ఉత్సాహం ఉప్పొంగుతోంది.

డోలీపైనే ఆస్పత్రికి తరలింపు



డోలీపై రోగిని మోసుకెళ్తున్న దృశ్యం

మల్కనగిరి: రహదారి సౌకర్యం లేకపోవడంతో అనారోగ్యానికి గురైన ఒక వ్యక్తిని డోలీపై మోసుకుంటూ వైద్య కేంద్రానికి తీసుకెళ్లిన ఘటన జిల్లాలోని చిత్రకొండ సమితి నువాగడ పంచాయతీ పరిధి రథగుడ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రథగుడ గ్రామానికి చెందిన డమ పూజారి (50) అనారోగ్యంతో గత కొద్ది రోజులుగా బాధపడుతున్నాడు. అతడి ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకొని వెళ్లాలని అనుకున్నారు. అయితే రథపూట్ గ్రామం నుంచి మంత్రిపుట్ గ్రామానికి చేరుకోవడానికి వంతెన లేకపోవడంతో వాహనాల రాకపోకలకు అవకాశం లేదు. దీంతో ఎటువంటి సమస్య వచ్చినా రథగుడ గ్రామానికి చెందిన ప్రజలు సుమారు 8 కిలోమీటర్ల దూరం వరకు రోగులను డోలీపై మోసుకుంటూ మంత్రిపుట్‌కు చేరుకోవాలి. అందువలన డమ పూజారిని డోలీలో తీసుకొని వెళ్లారు. అందువలన ఇప్పటికైనా అధికారులు, నాయకులు ఇప్పటికైనా స్పందించి ఈ రెండు గ్రామాలకు అనుసంధానించే విధంగా వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

డీఐజీగా నీతి శేఖర్



డీఐజీ నీతి శేఖర్

జయపురం: రాష్ట్ర ప్రభుత్వం ఐపీఎస్ అధికారులను ఆదివారం బదిలీ చేసింది. దీనిలో భాగంగా కొరాపుట్‌లోని దక్షిణ, పశ్చిమ ప్రాంత డీఐజీగా ఐపీఎస్ అధికారి నీతి శేఖర్‌ను నియమించింది. ఇదివరకు ఇక్కడ విధులు నిర్వహించిన చరణ్‌సింగ్ మీనను కటక్ సెంట్రల్ రేంజ్ డీఐజీగా బదిలీ చేశారు. అలాగే కొరాపుట్ జిల్లా ఎస్పీగా రోహిత్ వర్మను నియమించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన ఎస్పీ అభినవ సోన్‌కార్‌ను డెంకానల్ ఎస్పీగా బదిలీ చేశారు. అదేవిధంగా నవరంగపూర్ నూతన ఎస్పీగా మిహిర్ పండను నియమించారు.

గుంతలో పడిన గున్న ఏనుగు



గుంతలోంచి బయటకు రాలేకపోతున్న గున్న ఏనుగు

భువనేశ్వర్: భవానీపట్న అటవీ ప్రాంతంలో గున్న ఏనుగు గుంతలో పడింది. కెసింగా అటవీ మండలం పరిధి పరిసర ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా 30 పైబడిన ఏనుగుల గుంపు పంట పొలాల్లో విధ్వంసకర పరిస్థితులు సృష్టిస్తున్నాయి. ఈ గుంపునకు చెందిన గున్న ఏనుగుగా భావిస్తున్నారు. ప్రత్యక్ష సాక్షులు స్థానిక పోలీసు, అటవీ శాఖ అధికారులకు ఈ సమాచారం చేరవేశారు. ఘటనా స్థలంలో అధికారుల పరిశీలన చేపట్టారు.

ట్రక్కుని ఢీకొన్న బస్సు

- ఒకరి దుర్మరణం



ప్రమాదానికి గురైన బస్సు

భువనేశ్వర్: రోడ్డు పక్కన నిలిపిన ట్రక్కుని ప్రయాణికుల బస్సు ఢీకొంది. ఈ దుర్ఘటనలో అక్కడికక్కడే ఒక ప్రయాణికుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ విచారకర సంఘటన జాజ్‌పూర్ జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. 16వ నంబర్ జాతీయ రహదారి జరకా కూడలి ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ప్రమాదంలో 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో 2 మంది పరిస్థితి విషమంగా కొనసాగుతుంది. వీరిరువుర్ని సత్వర ఉన్నత చికిత్స కోసం కటక్ ఎస్‌సీబీ వైద్య బోధన ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారంతా జాజ్‌పూర్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 50 మందితో నిండిన రాజా అనే ప్రైవేటు బస్సు మయూర్‌భంజ్ జిల్లా బరిపద నుంచి భువనేశ్వర్ వైపు వెళ్తుండగా దురదృష్టవశాతు రహదారి పక్కన నిలబడి ఉన్న ట్రక్కుని ఢీకొంది. స్థానిక ధర్మశాల థాణా పోలీసులు ప్రమాదానికి కారణమైన బస్సుని స్వాధీనపరచుకుని విచారణ ప్రారంభించారు.

మంచం పట్టిన ఒనికొండ

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సెరిగుమ్మ పంచాయతీలోని ఒనికొండ గ్రామం మంచం పట్టింది. ఈ గ్రామంలో విష జ్వరాలతో వారం రోజుల్లో ఇద్దరు మృతి చెందగా, మరో 9 మంది అస్వస్థతతో బాధపడుతున్నారు. మారుమూల ప్రాంతమైన ఈ గ్రామం కొండల మధ్య ఉంది. 23 కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామంలో సుమారు 70 మందికి పైగా జనాభా నివసిస్తున్నారు. గత వారం రోజుల్లో జ్వరాల బారినపడి గ్రామానికి చెందిన లలిత మినియాక (26), పలాయి కులిసిక (36) లు మృతి చెందగా పకిరి కులిసిక, ముని కులిసిక, కటి కులిసిక, టిలాయి పిడిసిక, లెంబరి కులిసిక, రాణీ కులిసిక, ఒంలా కులసిక, మాలిక కులిసిక, హర్ష్ ప్రస్కాలు జ్వరంతో మంచానపడ్డారు. అయితే ఇంతవరకు వైద్యశాఖ ఆ గ్రామానికి వెళ్లిన దాఖలాలు లేవు. అదేవిధంగా గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారు కూడా అలా మంచానపట్టి ఉంటున్నారు తప్పా చికిత్స కోసం హాస్పిటల్‌కు వెళ్లడం లేదు. వారంతా నమ్మే నాటు వైద్యం, పూజలతో నయమవుతుందని వాటిపైనే ఆధారపడుతున్నారు. గత కొద్ది రోజుల క్రితం ఇదే సమితికి చెందిన లంబేరి గ్రామంతో వింత జ్వరాలతో ఐదుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఒనికొండ గ్రామానికి వెళ్లి మెరుగైన చికిత్సను అందించాల్సిన అవసరం ఉంది.

నిమజ్జనంలో విషాదం



ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

- బాణాసంచా పేలి వ్యక్తి మృతి

కొరాపుట్: గణేష్ నిమజ్జనంలో విషాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో బాణాసంచా పేలడం వలన ఒక వ్యక్తి మృతి చెందాడు. నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ కోట్ పట్టణంలోని 9వ నంబర్ వార్డు శివాజీనగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. లక్ష్మీ బాంబులు, చిచ్చుబుడ్లు ఏకకాలంలో కాలుస్తున్న దీపక్ హరిజన్ (30) శరీరానికి అగ్ని మంటలు అంటుకున్నాయి. ఇది గుర్తించిన స్థానికులు అగ్ని మంటలు ఆర్పి అతడిని ఉమ్మర్‌కోట్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే దీపక్ మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు.



ఉమ్మర్‌కోట్ ప్రభుత్వ ఆస్పత్రిలో దీపక్ మృతదేహం

కలెక్టరేట్‌లో ప్రమాదం



ధ్వంసమైన ఇన్వర్టర్లు

భువనేశ్వర్:

ఖుర్దా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆకస్మిక ప్రమాదం సంభవించింది. ఈ కార్యాలయం సముదాయం ప్రజాభియోగ విచారణ శిబిరంలో ఇన్వర్టర్ వ్యవస్థ మంటల్లో ధ్వంసం అయింది. అదృష్టవశాత్తు ఈ వ్యవస్థ మినహా ఇతర నష్టం సంభవించకపోవడంతో యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. షార్టు సర్క్యూట్‌తో ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



బైక్‌లు ఢీకొన్న ప్రమాద దృశ్యం

భువనేశ్వర్: సుందరగడ్ జిల్లాలో దురదృష్టకర ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రాంతలో సోమవారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఒకదానికొకటి ముఖాముఖీ ఢీకొని మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఒకరు ఘటనా స్థలంలో సజీవ దహనమయ్యారు. బీరమిత్రపూర్ కుద్దాపాణి ప్రాంతంలో ఈ విషాద సంఘటన సంభవించింది. బీరమిత్రపూర్, రాయిబోగ మార్గంలో ఉభయ దిశల్లో ఎదురెదురుగా వచ్చిన 2 బైక్‌లు ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఢీకొన్న రెండు బైక్‌లు ధ్వంసం అయ్యాయి. మంటల్లో ఒకరు సజీవ దహనం అయ్యారు. మరో వ్యక్తి అర్ధ దగ్ధమై ప్రాణాపాయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఇంకో వ్యక్తి తీవ్ర గాయాలపాలై రౌర్కెలా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతని పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్య వర్గాల సమాచారం. మృతుడు ఝార్ఖండ్ ప్రాంతానికి చెందిన అశోక్ అగర్వాల్‌గా గుర్తించారు. బాధితులకు తొలుత బీరమిత్రపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చి చికిత్స ప్రారంభించారు. పరిస్థితి విషమించడంతో కటక్ ఎస్సీబీ మెడికల్ కాలేజి ఆస్పత్రికి తరలించారు.



మంటల్లో దగ్ధమైన బైక్‌లు

'జిల్లాల పరిధిలోనే ఉద్యోగాలు కల్పించాలి'



కార్యచరణ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: జిల్లాల పరిధిలోనే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నవరంగపూర్ జిల్లాలోని సర్పంచ్‌ల సంఘం, సంయుక్త కార్యాచరణ కమిటీలు డిమాండ్ చేస్తున్నాయి. ఉద్యోగాల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా అక్టోబర్ 4వ తేదీన అవిభక్త కొరాపుట్ జిల్లా బంద్ జరపాలని కార్యాచరణ కమిటీ నిర్ణయించింది. నవరంగపూర్ జిల్లా డాబుగాంలో ఆదివారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆందోళన కార్యక్రమం ప్రకటించింది. అక్టోబర్ 1వ తేదీన ప్రతీ సమితి కార్యాలయం ఎదుట ముఖ్యమంత్రి, గణశిక్షా మంత్రుల దిష్టి బొమ్మలను దహనం చేయాలని జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. 2వ తేదీన నవరంగపూర్ మహాత్మా గాంధీ విగ్రహం ముందు నిరాహార దీక్షలు నిర్వహించాలని, 4వ తేదీన అవిభక్త కొరాపుట్ బంద్ చేపట్టాలని సమావేశం పిలుపునిచ్చింది. అలాగే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే బాధ్యతను డాబుగాం బీజేడీ ఎమ్మెల్యే మనోహర రొంధారి, కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే భుజబల మఝిలకు అప్పగించాలని సమావేశం నిర్ణయించింది. సమావేశంలో డాబుగాం ఎమ్మెల్యే మనోహర రొందారి, మాజీ ఎంపీ రమేష్ మఝి, జిల్లా పరిషత్ అధ్యక్షుడు మోతీరామ్ నాయిక్, మాజీ ఎమ్మెల్యే భుజబల మఝి, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠీ, ఒడిశా రాష్ట్ర ఆదివాసీ మహాసంఘ అధ్యక్షుడు అర్జున భొత్ర, జనజాతి సురక్షా మంచ్ ఉపాధ్యక్షుడు రతన్ మఝి, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు జలందర మఝి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల పోస్టులు భర్తీ చేయండి



మంత్రి ముఖేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయగడ: ఆదివాసీ, హరిజన ప్రాంతమైన రాయగడ జిల్లాల్లో వైద్యుల కొరత తీవ్రంగా ఉందని, ఈ నేపథ్యంలో వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పటాన్నయక్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ మోర్చ ఉపాధ్యక్షుడు కాశీరాం మాఝిలు కోరారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ముఖేష్ మహాలింగకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని 11 సమితుల్లో ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో 461 మంది వైద్యులు ఉండాల్సి, ఉన్నప్పటికీ ఆయా వైద్య కేంద్రాల్లో కేవలం 147 మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. దీంతో వైద్యుల కొరత కారణంగా రోగులు అత్యవసర పరిస్థితుల్లో పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విశాఖపట్నం అలాగే బరంపురం, కొరాపుట్ ప్రాంతాలకు మెరుగైన చికిత్స కోసం వెళ్లాల్సి వస్తోందని వివరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

విచారణ ఆరంభం

- భరత్‌పూర్ కేసులో విచారణ చేపట్టిన ఏకసభ్య కమిషన్
- హైకోర్టుని ఆశ్రయించిన నిందితులు



విశ్రాంత జస్టిస్ చిత్తరంజన్ దాస్ అధ్యక్షతన ఏకసభ్య కమిషన్ విచారణ జరుగుతున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపిన భరత్‌పూర్ థాణా కేసులో నిజానిజాలు నిగ్గు తేల్చే ప్రక్రియ ఆరంభం అయింది. ఈ సంఘటనపై ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రైం శాఖ దర్యాప్తు కొనసాగుతుండగా పరిస్థితి సమస్యాత్మకం కావడంతో ఏకసభ్య న్యాయ కమిషన్‌తో విచారణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో విశ్రాంత జస్టిస్ చిత్తరంజన్ దాస్ అధ్యక్షతన న్యాయ కమిషన్ విచారణ సోమవారం నుంచి ఆరంభమైంది. స్థానిక ప్రత్యేక సర్క్యూట్ హౌస్‌లో న్యాయ కమిషన్ విచారణ చేపట్టింది. తొలిరోజు విచారణకు రాష్ట్ర హోం శాఖ కార్యదర్శి సత్యబ్రత సాహు, పోలీసు డైరెక్టర్ జనరల్ వై.బి.ఖురానియా హాజరయ్యారు.

నేటి నుంచి అఫిడవిట్ల దాఖలు

భరత్‌పూర్ సంఘటనలో పలు ఆరోపణలు, ప్రత్యారోపణలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ఈ కేసుకు సంబంధించిన సమాచారం ఆధారిత వివరాలతో అఫిడవిట్లు దాఖలు చేసేందుకు న్యాయ కమిషన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం నోటిఫికేషన్ జారీ అవుతుందని న్యాయ కమిషన్ కార్యదర్శి తెలిపారు. 21 రోజులపాటు అఫిడవిట్ దాఖలు ప్రక్రియ నిరవధికంగా కొనసాగుతుందని తెలిపారు.



భరత్‌పూర్ స్టేషన్

ముందస్తు బెయిల్‌కు సన్నాహాలు

ఈ ఘటనలో 5 మంది పోలీసుస్టేషన్ సిబ్బంది ప్రధాన నిందితులుగా ఉన్నారు. వీరిలో భరత్‌పూర్ థాణా ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి ఒకరు కాగా, 2 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఒక సహాయ సబ్ ఇనస్పెక్టర్, ఒక కానిస్టేబుల్ ఉన్నారు. వీరంతా ముందస్తు బెయిల్ కోసం రాష్ట్ర హైకోర్టుని ఆశ్రయించారు.

గుజరాత్‌లో పరీక్షలు

ప్రధాన నిందితుల వాంగ్మూలం నిజానిజాల ధ్రువీకరణ కోసం ఉన్నత స్థాయి పరీక్షలు చేపడుతున్నారు. స్థానిక సబ్ డివిజినల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ అనుమతి మేరకు 5 మంది నిందితులను గుజరాత్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరికి తరలించారు. అక్కడ అబద్ధ నిర్ధారణ (లై డిటెక్షన్), బ్రెయిన్ మ్యాపింగ్, నార్కో విశ్లేషణ వంటి పోలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 15వ తేదీ అర్ధరాత్రి పూట రోడ్డు రోమియోల ఆగడాలతో భరత్‌పూర్ పోలీసు థాణాలో కేంద్రీకృతం అయింది. బాధితురాలి గోడు మీడియాలో ప్రసారం కావడంతో అనుబంధ వర్గాలు ఉలికిపాటుకు గురయ్యాయి. తక్షణమే నిందిత సిబ్బందిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు పోలీసు డైరెక్టర్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. దర్యాప్తు కోసం క్రైం శాఖ రంగంలోకి దిగింది. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య న్యాయ కమిషన్ నియమించి 60 రోజుల్లో నివేదిక దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ సంఘటనపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్వయంగా చొరవ కల్పించుకోవాలని సైనిక సిబ్బంది వర్గం బహిరంగ లేఖ జారీ చేసింది. దీని ప్రభావంతో విచారణకు స్వీకరించిన హైకోర్టు థాణాలో పోలీసుల వ్యవహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. బాధితురాలికి సెప్టెంబర్ 18వ తేదీన హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ

భువనేశ్వర్: భువనేశ్వర్ – కటక్ జంట నగరాల పోలీసు కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి దేవ దత్త సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గౌరవ కవాతుతో ఆయనను స్వాగతించారు. ఆయన 1998 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. పలు హోదాల్లో లోగడ నిర్వహించిన బాధ్యతలపై కార్యదక్షత చాటుకున్నారు. 2024 సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని భారత రాష్ట్రపతి విశిష్ట సేవల పురస్కారం అందుకున్నారు. అలహాబాద్ విశ్వ విద్యాలయం నుంచి డిగ్రీ మరియు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్, డాక్టరేట్ పూర్తి చేశారు.

బైక్‌ని ఢీకొన్న ట్రాక్టర్



ప్రమాద దృశ్యం

భువనేశ్వర్: మయూర్‌భంజ్ జిల్లాలో బైక్‌ని ట్రాక్టర్ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. ఉదొలా పోలీసు ఠాణా కుట్లింగ్ బియ్యం మిల్లు కూడలి వద్ద సోమవారం జరిగింది. కుట్లింగ్ గ్రామస్తులు భాదొ హేంబ్రమ్, రామేశ్వర్ హేంబ్రమ్ మృతి చెందారు. కుట్లింగ్ గ్రామం నుంచి ఇటుకల లోడుతో దూసుకుపోతున్న ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న బైక్‌ని ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఉదొలా ఠాణా పోలీసులు ఘటనా స్థలం సందర్శించి మృతదేహాల్ని పంచనామా కోసం సిఫారసు చేశారు.

గంజాయి స్వాధీనం



వ్యాన్‌తో పాటు నిందితులను పట్టుకున్న పోలీసులు

రాయగడ: ఒక పికప్ వ్యాన్‌లో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను చంద్రపూర్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 3.75 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టుకు తరలించారు. చంద్రపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ వీరేంద్ర రాయ్ తెలిపిన వివరాల మేరకు.. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్న సమాచారం తెలుసుకున్న పోలీసులు చంద్రపూర్ సమీపంలోని కరమ ఘాటి వద్ద వాహన తనిఖీలను ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ క్రమంలో గజపతి జిల్లా వడవ నుంచి మునిగుడ వైపు వస్తున్న ఒక పికప్ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేశారు. దీనిలో భాగంగా అందులో 11 బస్తాల గంజాయి పట్టుబడింది. దీంతో వడవ పోలీస్‌స్టేషన్ పరిధి బంధుగుడ గ్రామానికి చెందిన అరుణ్ బిసొయి, వ్యాన్ డ్రైవర్ మిధున్ బిసొయిలను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 7 ట్రాక్టర్లు సీజ్

ఆమదాలవలస : మండలంలోని నాగావళి నది పరివాహక ప్రాంతమైన దూసి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి ఏడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ కె.వెంకటేష్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు నదీ పరివాహక ప్రాంతం నుంచి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. అయితే కలెక్టర్ కార్యాలయం నుంచి, ఎస్పీ కార్యాలయం నుంచి వచ్చిన సమాచారంతోనే తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఆమదాలవలస పోలీసులు స్పందించి ఇసుక అక్రమ రవాణా వాహనాలు పట్టుకుంటున్నట్లు ఆమదాలవలస నియోజకవర్గ వాసులు చర్చించుకుంటున్నారు.

ఇసుక లారీల పట్టివేత

కొత్తూరు: మండలంలోని మెట్టూరు వద్ద మూడు, స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద రెండు ఇసుక లారీలను స్థానిక సీఐ చింతాడ ప్రసాదరావు పట్టుకున్నారు. ఇసుక లారీల డ్రైవర్ల వద్ద ఒడిశా రాష్ట్రం పెంగూడ ఇసుక ర్యాంపు రశీదులు ఉన్నట్లు సీఐ చెప్పారు. ఎక్కడ నుంచి ఇసుక లోడు చేశారన్నది నిర్ధారించాలని కొత్తూరు తహసీల్దార్‌ను కోరినట్లు చెప్పారు. ఇసుకను భామిని మండలంలో లోడ్ చేసినట్లు లారీ డ్రైవర్లు ఆర్‌ఐ, సీనియర్ అసిస్టెంట్లకు చెప్పినట్లు తహసీల్దార్ తెలిపారు.

సబ్జెక్టు కాంట్రాక్టు పోస్టులకు ఇంటర్వ్యూల నిర్వహణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో సోమవారం సబ్జెక్టు కాంట్రాక్టు పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సైన్స్, ఆర్ట్స్, ఇంజినీరింగ్ సబ్జెక్టులకు ఇంటర్వ్యూలు ఆయా కళాశాలల్లో నిర్వహించారు. పదుల సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యారు.

అనాథ బాలుడికి శస్త్ర చికిత్స

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనురాగ నిలయంలో ఉంటున్న సోహిల్ (8) అనే అనాథ బాలుడికి ఏ–1 ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ మూల వెంకటరావు శస్త్ర చికిత్స చేసి సోమవారం ప్రాణాలు కాపాడారు. సోహిల్ ఆదివారం కడుపునొప్పి, వాంతులు కావడంతో ఏ–1 ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి అత్యవసర శస్త్ర చికిత్స చేయాల్సి ఉందని చెప్పారు. రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు కోరిన మేరకు ఉచితంగా అపెండిసైటిస్ శస్త్ర చికిత్సను నిర్వహించారు.



సైన్స్ ప్రదర్శన తిలకిస్తున్న ప్రముఖులు



కలుషిత నీరు మేనేజ్‌మెంట్ ప్రయోగ శాలపై చైర్మన్‌కు వివరిస్తున్న విద్యార్థులు



చిత్ర లేఖన పోటీల్లో విద్యార్థులు

స్వచ్ఛతపై సైన్స్ ఎగ్జిబిషన్



వేస్ట్ పేపర్లతో అందమైన అలంకరణ పువ్వులు

స్వచ్ఛ యే సేవ అన్న అంశంపై జయపురం మున్సిపాలిటీ విద్యార్థుల మధ్య ఆర్ట్స్, క్రాఫ్ట్ పోటీలతో పాటు సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలను నిర్వహించింది. స్థానిక నారాయణి కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ఈ పోటీల్లో పట్టణంలోని వివిధ పాఠశాలల నుంచి 412 మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ ఎన్విరాన్‌మెంట్‌పై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు తమకు అభిప్రాయాలను చిత్ర లేఖన, బొమ్మల, విజ్ఞాన ప్రదర్శనల ద్వారా వ్యక్తం చేశారు. బృహత్తర లక్ష్యంతో నిర్వహించిన పోటీల కార్యక్రమంలో చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, వైస్ చైర్మన్ బి.సునీత అతిథులుగా విద్యార్థులను ఉత్సాహపరిచారు.

– జయపురం



క్రాఫ్ట్ పోటీలో విజేతగా నిలిచిన విద్యార్థిని



అపార్ట్‌మెంట్ల వలన పారిశుధ్య వ్యవస్థపై పడే ప్రభావంపై వివరిస్తున్న విద్యార్థి



జేసీబీల ఉపయోగంపై వివరిస్తున్న విద్యార్థులు



విజేత విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

‘సమస్యలు పరిష్కరించాలి’

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మౌలిక సమస్యలపై త్వరలో ఆందోళన చేపట్టనున్నామని ఆ సంఘం అధ్యక్షుడు రాజీవ్ పాఢి తెలిపారు. స్థానిక రాజవీధిలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉదయం ఆయన మాట్లాడారు. అతి తక్కువ వేతనంతో ఆరేళ్లుగా కలెక్టరేట్, మెడికల్, ఇతర ప్రభుత్వ శాఖల్లో పనిచేశామని, అయినా తమ సర్వీసులను రెగ్యులర్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా కోవిడ్ సమయంలో ప్రభుత్వానికి అనేక సేవలు అందించినా కొంతమందిని విధుల నుంచి తొలగించడం నేరమని వాపోయారు. తొలగించిన వారిని వెంటనే సర్వీసులోకి తీసుకోవాలని, జీతాలు పెంచాలని, దినసరి



మాట్లాడుతున్న రాజీవ్ పాఢీ తదితరులు

వేతనం అందుకుంటున్న ఎన్ఎంఆర్‌లతో సమానంగా పరిగణించాలని కోరారు. సమావేశంలో సంఘం కార్యదర్శి పంకజ్ కుమార్, కోశాధికారి తపస్ కుమార్ మిశ్రా, ఆర్గనైజింగ్ సెక్రటరీ మానస్ కుమార్ మిశ్రా, సాధారణ కార్యదర్శి మానస్ కుమార్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ



పర్లాకిమిడి: వినతులు స్వీకరిస్తున్న అధికారులు



రాయగడ: వీల్‌చైర్ పంపిణీ చేసిన కలెక్టర్ పట్వారి

రాయగడ: జిల్లాలో గుణుపూర్‌లోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వినతుల స్వీకరణ కార్యక్రమం కలెక్టర్ ఫరూల్ పట్వారి అధ్యక్షతన సోమవారం జరిగింది. కార్యక్రమంలో గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోట, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. గుణుపూర్ పరిసర ప్రాంతాలకు చెందిన 68 వినతులను ప్రజల నుంచి స్వీకరించారు. వీటిలో 30 గ్రామ సమస్యలు కాగా, 38 వ్యక్తిగత సమస్యలు విన్నారు. ఆవాస్ యోజన పథకంలో ఇళ్ల మంజూరు, వైద్య సమస్యలు, తాగు, సాగునీటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల సమస్యలను పరిగణలోకి తీసుకుని త్వరలో పరిష్కారమయ్యేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఒక వ్యక్తికి వీల్‌చైర్‌ను పంపిణీ చేశారు.

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ సమితి మర్లబ పంచాయతీ కార్యాలయంలో కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. దీనిలో ఆర్‌డీఏ సీడీఎం గుణనిధి నాయక్, అదనపు ఎస్పీ సునీల్ మహంతి తదితరులు పాల్గొన్నారు. మొత్తం 293 వినతులు అధికారులకు అందగా, వాటిలో 150 వినతులు వెంటనే పరిష్కరించారు.

అలవాటే ప్రాణం తీసింది

పొందూరు: చుట్ట కాల్చే అలవాటు ఓ వృద్ధురాలి ప్రాణం తీసింది. లోలుగు గ్రామంలో సోమవారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన జడ్డు వరహాలమ్మ(93) తన అల్లుడు లోలుగు సూర్యనారాయణ ఇంటిలో ఉంటారు. భర్తతో పాటు ఒక్కగానొక్క కుమార్తె మరణించడంతో అల్లుడు సూర్యనారాయణ ఇంటిలోనే ఉంటున్నారు. వరహాలమ్మ ఎప్పటిలాగే చుట్ట కాల్చుతుండగా నోటిలో ఉ న్న చుట్ట చీరపై పడింది. ఫ్యాను గాలికి చుట్ట నుంచి మంటలు చెలరేగి దుస్తులకు అంటుకుంది. కుటుంబ సభ్యులు చూసి మంటలు ఆర్పేలోగా 90 శాతం శరీరం కాలిపోయింది. ఆస్పత్రికి తరలించేలోగా ఇంటి వద్దనే మృతి చెందింది. అల్లుడు సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. అనంతరం శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే సహించబోము

పాతపట్నం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజుల పాలన పూర్తయినప్పటికీ ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయడంలో విఫలమైందని, ఊళ్లలో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, అరాచకాలతో పాలన సాగిస్తున్నారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. మండలంలోని ప్రహరాజపాలేంలో వైఎస్సార్ జగనన్న కాలనీలోని నిర్మించిన ఆర్చిపై ఉన్న వైఎస్సార్ జగనన్న కాలనీ పేరును దుండగులు తొలగించారు. ఆ ఆర్చిని నాయకులతో కలిసి ఆమె సోమవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల పాలనలో భూ ఆక్రమణలు, ఇసుక దోపిడీ, కక్ష సాధింపు తప్ప ఇంకేమీ చేయలేదని గుర్తు చేశారు. ఆమెతో పాటు ఎంపీపీ దొర సావిత్రమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్య క్షుడు సవిరిగాన ప్రదీప్, మాజీ సచివాలయ మండల కన్వీనర్ ఎనుగుతల సూర్యం , మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ మద్దు తాతయ్య, మండల ప్రత్యేక సలహాదారుడు ఎం.గణపతిరావు, కోఆప్షన్ సభ్యుడు మాదవ్ పుల్లాయ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగానికి పెద్దపీట



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

- నవరంగపూర్ ఎంపీ బలభద్ర మాఝి

మల్కన్‌గిరి: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందని నవరంగపూర్ ఎంపీ బలభద్ర మాఝి అన్నారు. జిల్లాలోని పోడియాలో కొత్తగా నిర్మించిన పీహెచ్‌సీని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలను కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. గత 25 ఏళ్ల బీజేడీ పాలనలో రాష్ట్రం తిరగమనం వైపునకు ప్రయాణించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలనే ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి ఎమ్మెల్యే నరసింహ మడ్కామి, జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ధనేశ్వర్ మహాపాత్రో, పాడియా సమితి బీడీవో అభిమన్యు కవి సతపతి, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సిద్దార్ద్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు అవస్థలు



కెనాల్‌లో మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం

కొరాపుట్: మృతదేహానికి అంత్యక్రియలు జరిపేందుకు పీకల్లోతు నీటిలో వెళ్తూ అవస్థలు పడిన ఘటన నవరంగ్‌పూర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఉమ్మర్‌కోట్ పట్టణంలోని 8వ వార్డులో ఒక వృద్ధుడు సోమవారం మృతి చెందాడు. దీంతో మృతదేహానికి ఆ గ్రామ శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తాయి. శ్మశానానికి, గ్రామానికి మధ్యలో ఉన్న కెనాల్‌పై వంతెన లేకపోవడంతో పీకల్లోతు నీటిలోనే మృతదేహాన్ని తీసుకొని వెళ్లారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

ఆదివాసీ మహా సంఘం ఏర్పాటు



నూతన కార్యవర్గ సభ్యులు

జయపురం: సమితి స్థాయి ఆదివాసీ మహా సంఘాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. గౌడాపాదర్ గ్రామం బిరపాణి మందిర ఆవరణలో పొరజ, అమనాత్య, గదబ, సౌర, కంద, దొర, భూమియ, హలబ, భొత్ర తదితర ఆదివాసీ సాంప్రదాయ ప్రజా సంఘాల ప్రతినిధులు గిరిజన నేత ఆనంద హలవ అధ్యక్షతన సమావేశమయ్యారు. దీనిలో భాగంగా సమితి స్థాయి ఆదివాసీ మహా సంఘం ఏర్పాటు చేశారు. సమితిలోని అన్ని ఆదివాసీ సాంప్రదాయ ప్రజలంతా ఏకం కావాలని, సమస్యలు సమైక్యంగా పరిష్కరించుకునేందుకు మహాసంఘం ఏర్పాటు అవసరమని ఆనంద హలవ వివరించారు. గిరిజనుల్లో ఎన్ని తెగలున్నా వారంతా ఆదివాసీలేనని నొక్కి చెప్పారు. అనంతరం సమావేశంలో నూతన సంఘం కోసం ఎన్నికలు నిర్వహించారు. మహా సంఘానికి అధ్యక్షుడిగా జితేంద్ర నాయిక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షుడిగా ఆనంద హలవ, కార్యదర్శిగా భగవాన్ ఖెందు, సహాయ కార్యదర్శిలుగా బలభద్ర గదబ, నవీన జాని, కోశాధికారులుగా శశిభూషణ భూషణ సౌర, గంగాధర హలవ తదితరులను ఎన్నుకున్నారు.



ఒడిశా టు విశాఖపట్నం..

వయా శ్రీకాకుళం

- ఆగని గంజాయి అక్రమ రవాణా
- 20 రోజుల్లో 300కిలోలకు పైగా పట్టివేత
- జిల్లాలో 55 మంది క్రయ విక్రయదారుల పరారీ

శ్రీకాకుళం క్రైమ్ :

ఒడిశా నుంచి శ్రీకాకుళం మీదుగా విశాఖ వరకు గంజాయి అక్రమ రవాణా హైవేపై అడ్డు లేకుండా సాగుతోంది. పోలీసుల దాడులు, అరెస్టులు, పెట్రోలింగ్ తనిఖీలు ఎంత ముమ్మరంగా చేసినా గంజాయి బ్యాచ్ ఆగడాలు ఆగడం లేదు. గడిచిన 20 రోజుల్లో 300 కిలోలకు పైగా గంజాయిను పోలీసులు పట్టుకున్నారు.

జిల్లాలో మూడు ప్రధాన చెక్‌పోస్టులు పురుషోత్తపురం(ఇచ్ఛాపురం), పైడిభీమవరం, పాతపట్నం ఉన్నాయి. ఈ మూడింటిలో పురుషోత్తపురం, పాతపట్నం చెక్‌పోస్టుల వద్దనే అధికంగా గంజాయి దొరుకుతోంది. ఒడిశా నుంచి రవాణా అవుతుండడంతో ఈ చెక్‌పోస్టుల వద్దనే గంజాయి పట్టుబడుతోంది. ఒడిశాలోని గంజాం, గజపతి వంటి జిల్లాల్లో సాగు చేస్తున్న వ్యాపారుల వద్ద తక్కువకు కొని మన జిల్లా మీదుగా విశాఖ తరలిస్తున్నారు. జీఆర్పీ స్టేషన్లు లేని ప్రాంతాలను ఎంచుకుని రవాణా చేస్తున్నారు. గంజాయి అలవాటు ఉన్న వారిలో సంఘ విద్రోహ శక్తులు కూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.


పరారీలో 55 మంది..

జిల్లాలో గంజాయికి సంబంధించి క్రయ విక్రయదారులు(పాత నేరాలు, కొత్తవి కలిపి) 55 మందికి పైగా పరారీలో ఉన్నారని అప్పట్లో స్వయంగా ఎస్పీ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వీరిలో ఎనిమిది మందిని పట్టుకున్నారు. జిల్లాలో గంజాయిని 75 శాతం కళాశాలల ప్రాంతాల్లోను, 25 శాతం నదీ ప్రాంతాల్లోనే వాడుతున్నారు. వీరంతా ఒడిశా నుంచి తెచ్చే స్థానిక వ్యాపారుల నుంచి చిన్న చిన్న ప్యాకెట్లుగా (గ్రాముల్లో) కొనుక్కొని సేవిస్తుంటారు.

ఆపరేషన్ గంజాయితో..

ఈ నెల ఆరంభంలో శ్రీకాకుళంలో ఆపరేషన్ గంజాయి పేరుతో ఎస్పీ మహేశ్వరరెడ్డి సమక్షంలో డీఎస్పీ వివేకానంద, సీఐ పైడపునాయుడులు ఓ కేసును ఛేదించారు. ఈ కేసే మొత్తం జిల్లా పోలీసు యంత్రాంగానికి మార్గదర్శకంగా నిలిచింది. ఆపై దాడులు ఉధృతం చేయడంతో గంజాయి లింకులన్నీ బయటపడ్డాయి. ఒడిశా నుంచి సీనా అనే వ్యాపారి నుంచి సరఫరా అని తెలిసింది. ఫలితంగా ఈనెల 7న తొమ్మిది మంది అరెస్టు అయ్యారు. ఎనిమిది మంది వ్యసనపరులను డీ అడిక్షన్ సెంటర్లకు పంపారు. ఇరవై రోజుల్లోనే ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట రైల్వేస్టేషన్ల వద్ద, హైవేల దారుల్లో 300 కిలోలకు పైగా గంజాయిని పట్టుకున్నారు.

అవగాహన కల్పిస్తాం..



గంజాయి క్రయ విక్రయాలు, అక్రమ రవాణాకి సంబంధించిన ఫిర్యాదుల నమోదు, డి–అడిక్షన్ కేంద్రాల సేవలకు టోల్ ఫ్రీ నంబర్ 14446కు డయల్ చేయాలి. రిమ్స్‌లో డి–అడిక్షన్ సెంటర్‌ను కూడా పూర్తిస్థాయిలో నిర్వహిస్తాం. జిల్లాలోని రంగస్థల కళాకారులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, ఎన్‌జీఓల సహకారంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం.

– స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కలెక్టర్, శ్రీకాకుళం

షీట్లు తెరుస్తున్నాం



ఒడిశా నుంచే మనకు గంజాయి సరఫరా అవుతుంది. చెక్ పోస్టులు, టోల్‌ప్లాజాలు, క్రైమ్ స్పాట్‌ల వద్ద ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టాం. డీజీపీ కార్యాలయం నుంచి డ్రగ్ ఐడెంటిటీ కిట్ సాయంతో పరిశోధిస్తున్నాం. ఈ ఏడాదిలోనే 24 కేసుల్లో 71 మందిని అరెస్టు చేసి 490 కిలోల గంజాయి సీజ్ చేశాం. 50 మందికి పైగా సస్పెక్ట్ షీట్స్, ఏడుగురిపై రౌడీషీట్ తెరిచాం.

– కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం జిల్లా

క్లుప్తంగా

రిమాండ్ ఖైదీలపట్ల అంకిత భావం ఉండాలి

● జిల్లా న్యాయమూర్తి-మౌలానా



రిమాండ్ ఖైదీల సమస్యలను తెలుసుకుంటున్న జిల్లా న్యాయమూర్తి మౌలానా

పాలకొండ రూరల్: రిమాండ్ ఖైదీలపట్ల సబ్ జైల్ సిబ్బంది అంకిత భావంతో వ్యవహరించాలని జిల్లా న్యాయమూర్తి మౌలానా అన్నారు. ఈ మేరకు సోమవారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధికారి ఎస్. సన్యాసిరావుతో కలిసి పాలకొండ సబ్‌జైలును ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అక్కడి రిమాండ్ ఖైదీలకు అందుతున్న సేవలు, న్యాయసేవలపై ఆరా తీశారు. నేరుగా ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను సానుకూలంగా విన్నారు. సబ్‌జైలులో వసతులు, రికార్డులను పరిశీలించారు. ఖైదీల ఆరోగ్య భద్రత పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని జైలు సూపరింటెండెంట్ బి.జోగులుకు సూచించారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు ఎంపిక



రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సీతంపేట: ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు తమ విద్యార్థులు ఎంపికైనట్లు స్థానిక గిరిజన గురుకుల బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ తెలిపారు. సౌత్ జోన్ అథ్లెటిక్స్‌లో 18 సంవత్సరాల లోపు విభాగంలో ద్వితీయస్థానంలో ఎస్.దిలీప్ జావెలెన్‌త్రోలో, షాట్‌పుట్‌లో ఎ.రవి, వందమీటర్ల పరుగుపందెంలో ఎస్.శరత్‌కుమార్, డిస్కత్రోలో ఎస్.జానగిని, త్రిపుల్ జంప్‌లో ఎ.సతీష్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. హాకీలో ఎస్.గణేష్, ఎస్.విజయ్‌కుమార్, ఎన్.ప్రవీణ్‌కుమార్, ఎస్.సబీర్, సవర శ్రీను, సవర మనోహర్, సవర ప్రదీప్, ఎస్.హర్షవర్ధన్‌లు ఎంపికయ్యారు. ఖోఖోలో ఆరిక అర్జున్ ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ లక్ష్మణమూర్తి, వైస్‌ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు ఆ విద్యార్థులను అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



శ్యామ్‌కుమార్ మృతదేహం

గుర్ల: మండలంలోని సొలిపిసోమరాజు పేట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లిమర్లకు చెందిన సింగిరోతు శ్యామ్ కుమార్ (40) మృతిచెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. నెల్లిమర్లకు చెందిన సింగిరోతు శ్యామ్ కుమార్ మిమ్స్ ఆస్పత్రిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. తన అత్తవారి ఊరు రాజాంలో పండగ ఉండడంతో రెండు రోజుల కిత్రం వెళ్లాడు. పండగ ముగించుకుని సోమవారం విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై నెల్లిమర్ల వస్తుండగా గుర్ల మండలంలోని సొలిపిసోమరాజు పేట వద్ద విజయనగరం నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టగా తలకు తీవ్రంగా గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. భర్త మృతి వార్తతో సంఘటన స్థలానికి చేరుకున్న భార్య శిరీష, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై పి.నారాయణ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ..



పార్వతి మృతదేహం

పాలకొండ రూరల్: మండలంలోని గొట్ట మంగళాపురం గ్రామానికి చెందిన మహిళా రైతు లంక పార్వతి (58)విద్యుత్ షాక్‌తో సోమవారం మరణించింది. బతుకుతెరువు కోసం గ్రామ సమీపంలో కొంత భూమిని కౌలుకు తీసుకుని భర్త సింహాచలంతో కలిసి కొద్దిపాటి కూరగాయలు సాగు చేస్తోంది. రోజూలాగానే కాయగూరలు సేకరించుకునేందుకు పొలానికి వెళ్లిన పార్వతి అప్పటికే తెగిపడి ఉన్న హైపవర్ విద్యుత్ వైర్లు కాలికి తగలగా ఘటనా స్థలంలోనే మృత్యువాత పడింది. కష్ట సుఖాల్లో తోడైన జీవిత భాగస్వామి తాము బతుకుతెరువుకు కౌలుకు తీసుకున్న పొలంలోనే తనువు చాలించడంతో భర్త గుండెపగిలేలా రోదించాడు. మృతురాలికి ముగ్గురు పిల్లలున్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

వైభవంగా ‘పూర్ణాహుతి’

● పట్టాభిషిక్తుడైన శ్రీరామచంద్రస్వామి
● దర్శించుకున్న ఎమ్మెల్యే నాగమాధవి, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్:

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామివారి దేవస్థానంలో పవిత్రోత్సవాలు సోమవారంతో వైభవంగా ముగిశాయి. గడిచిన నాలుగు రోజుల నుంచి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన రుత్విక్కులు ,దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. సోమవారం వేకువజామున స్వామివారికి ప్రాతఃకాలార్చన, బాలభోగం అర్పించిన తరువాత యాగ శాలలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామిని ఆస్థాన మంటపంలో వేంచేపు చేసి స్వామికి శాంతి కల్యాణం జరిపించారు. అనంతరం పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫలరసాలతో పట్టాభిషేకమహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు యాగశాలలో నిర్వహించిన ప్రత్యేకహోమాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం సీతారామస్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ వై.శ్రీనివాసరావు, అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్‌కుమార్ ఆచార్యులు, నాయకులు చనమల్లు వెంకటరమణ, అంబళ్ల అప్పలనాయుడు, రవ్వా నాని, లక్ష్మణరావు, సిబ్బంది రామారావు, తులసి, భక్తులు పాల్గొన్నారు.



కలశాలను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న అర్చకులు



యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తున్న అర్చకులు



ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబుకు ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

రక్తదానం ప్రాణదానం

● అవగాహనతో యువత ముందుకు రావాలి
● నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం

రాజాం సిటీ: మనిషి జీవప్రక్రియలో ప్రధాన రవాణా సాధనం రక్తం. శరీరాన్ని సమతూకంలో ఉంచాలంటే దాని ప్రాధాన్యం ఎంతో ఉంది. శరీరంలోని రక్తం పరిమాణం తగ్గితే ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుంది. రక్తం ఎర్ర, తెల్ల రక్తకణాలు, ప్లాస్మా కలిగి ఉన్న మిశ్రమద్రావణం. శస్త్రచికిత్సలు, ప్రమాదాలు ఇతరత్రా సమయాల్లో మనిషికి రక్తం చాలా అవసరం అవుతుంది. అత్యవసర సమయాల్లో రక్తం అందించి బాధితులను ఆదుకునేవారే ప్రాణదాతలు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండగా, ప్రస్తుతం సేకరిస్తున్న రక్తం ఆపదలో ఉన్నవారికి సరిపోవడం లేదు. రక్తదాన ఆవశ్యకతను తెలుసుకుని మేము న్నామంటూ కొంతమంది ముందుకొచ్చి రక్తదానం చేయడంతోపాటు అడపాదడపా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలతో అపాయంలో ఉన్నవారిని ఆదుకుంటున్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి, అత్యవసర చికిత్సలు అవసరమైన వారికి రక్తం ఎంతో అవసరం. రక్తాన్ని ఒకరి నుంచి మరొకరికి అందించాల్సిందే కానీ కృత్రిమంగా తయారుచేయలేం. అందుకే రక్తదానం ప్రాణదానంతో సమానం అంటారు. ఒకరి రక్తం మరొకరి ఆయుష్షును కాపాడుతుంది.

రక్తదానానికి వీరు అర్హులు....

● అపోహలు వీడి రక్తదానం చేయాలనుకునేవారు ఆరోగ్యంగా ఉండడంతోపాటు 18 నుంచి 60 ఏళ్ల లోపు వయసు, 50 కిలోల బరువు కలిగిఉండాలి.
● హిమోగ్లోబిన్ శాతం 12.5 ఉండాలి.
● చికెన్‌గున్యా, టైఫాయిడ్, మలేరియా, ఇతర వ్యాధులు సోకిన వారు నయం అయిన తరువాత నాలుగు నుంచి ఆరు నెలల తరువాత రక్తదానం చేయవచ్చు.
● రక్తదానం చేసేవారి నుంచి కేవలం 300 మిల్లీ లీటర్ల రక్తాన్ని మాత్రమే సేకరిస్తారు.



వాసవీక్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

● రక్తాన్ని సేకరించే ముందు వైద్యులు దాత ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తారు.

రక్తదానం ఒక బాధ్యత..



ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం బాధ్యతగా చేస్తుంటాను. ఇప్పటి వరకు శిబిరాల ద్వారా, స్వచ్ఛందంగా 50 సార్లు రక్తదానం చేశాను. ఆపదలో ఉన్నవారికి ఇలా ఉపయోగపడడం చాలా సంతోషంగా ఉంది. ఎప్పుడైనా ఎవరికైనా ఏ సమయంలో అవసరమైనా రక్తం ఇచ్చేందుకు నేను సిద్ధం.

శనపతి రాము, రక్తదాత, పొగిరి

రక్తం ఎంతో విలువైనది..



రక్తం ఎంతో విలువైనది. ప్రమాదాలు, శస్త్రచికిత్సల వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. యువత స్ఫూర్తితో ముందుకు వచ్చి రక్తదానం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అలాగే రక్తదానం చేయడం ద్వారా కొత్త రక్తం ఉత్పత్తి అయి ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుంది.

కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, రాజాం

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ క్రీడాకారుల ఎంపిక



అండర్-14 క్రీడాకారులతో పీడీలు

బాడంగి: విజయనగరం జిల్లాలోని బాడంగి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రాష్ట్రస్థాయిలో స్కూల్‌గేమ్స్‌కు చెందిన అండర్-14, అండర్-17బేస్‌బాల్ ఎంపికలు సోమవారం జరిగాయి. స్కూల్‌గేమ్స్ సెక్రటరీ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోటీలు జరుగగా జిల్లా నలుమూలల నుంచి 16 పాఠశాలలకు చెందిన సుమారు 200 మందిక్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను బ్యాటింగ్‌చేసి ఎంఈఓ-2 రాజేశ్వరి, హెచ్‌ఎం. సత్యనారాయణ ప్రారంభించారు. జిల్లా స్థాయి పోటీలలో పాల్గొన్న జట్ల నుంచి అంతర్ జిల్లాల పోటీలకు 4 క్రీడాజట్లను ఎంపిక చేశామని పీడీ జి.బంగారునాయుడు తెలిపారు. వారిలో అండర్-14 బాలికలు, బాలురు-2, అండర్-17 బాలికలు, బాలురు-2 జట్లుచొప్పున ఎంపిక చేశామని వారు నవంబరులో చిత్తూరు, గుంటూరు జిల్లాల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకానున్నట్లు చెప్పారు. ఈ ఎంపికలో జిల్లా వ్యాయామ సంఘం అధ్యక్షుడు వెంకటనాయుడు, మన్యం జిల్లా ఆర్చరీ అధ్యక్షుడు గాంధీ, సత్యనారాయణ, అప్పల నాయుడు, స్వప్న, సత్య, కేజీబీవీ పాఠశాలల నుంచి 30మంది పీడీలు పాల్గొన్నారని చెప్పారు.



అండర్-17 క్రీడాకారులతో పీడీలు

హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలి



ర్యాలీ చేస్తున్న ఎయిడ్స్ నియంత్రణ సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి పోగ్రాం మేనేజర్ కె.గౌరి అన్నారు. ఈ మేరకు కోట జంక్షన్ వద్ద హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై సోమవారం నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడుతూ సత్ప్రవర్తన కలిగి ఉండడం ద్వారా హెచ్‌ఐవీ బారిన పడకుండా ఉండవచ్చని హితవు పలికారు. హెచ్‌ఐవీ సోకిన తర్వాత కంటే రాకముందు జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎర్రయ్యమ్మ, ఝాన్సీరాణి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

అల్లాడ కుటుంబానికి పరామర్శ

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఏఎంసీ మాజీ చైర్మన్ అల్లాడ కృష్ణ కుటుంబాన్ని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొత్ససత్యనారాయణ, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చిన్నశ్రీను) సోమవారం పరామర్శించారు. ఈ మేరకు గ్రామంలోని ఆయన కుటుంబాన్ని కలిసి ఓదార్చి అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పార్టీ పటిష్టతకు, స్థానిక నాయకత్వానికి అండగా ఉన్న కృష్ణ మృతి పార్టీకి తీరని లోటని అన్నారు.ఏ ఆపద వచ్చినా తమకు సమాచారం ఇవ్వాలని, సహాయం చేసేందుకు తామెప్పుడూ సిద్ధంగా ఉంటామని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు.

వైఎస్సార్ జ్ఞాపిక బహూకరణ

బొబ్బిలి మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రియాజ్ ఖాన్ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను)లకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటాలను బహూకరించారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన తరువాత మొదటిసారిగా నియోజకవర్గానికి విచ్చేసిన బొత్స సత్యనారాయణ, చిన్న శ్రీనులను కలుసుకోవడం తమకెంతో ఆనందాన్నిచ్చిందని రియాజ్‌ఖాన్ హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో రామభద్రపురం ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, బొబ్బిలి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వెంకటనాయుడు, సర్పంచ్ ధనుంజయ్‌తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు వైఎస్సార్ చిత్రపటాన్ని బహూకరిస్తున్న కో ఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఖాన్

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 238 అర్జీలు



ఫిర్యాదులు అందుకుంటున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

సాలూరు రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 238 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశుసంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఇచ్చిన సమస్యలపై అధికారులు తొందరగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ ప్రజల నుంచి వినతిపత్రాలు అందుకున్నారు. ముఖ్యంగా సాలూరు మండలంలోని కరడవలస నుంచి కొత్తూరు రోడ్డు నిర్మాణానికి ఆయా గ్రామాల గిరిజనులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఇటీవల కరడవలస వెళ్లిన కలెక్టర్ ఆ గ్రామ ప్రజలకు రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని ఐటీడీఏ అధికారులకు పిలిచి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి కదా? రోడ్డు నిర్మాణానికి ఎస్టిమేషన్ పంపించారా? లేదా? అని ఐటీడీఏ డీఏను ప్రశ్నించారు. కొంతమంది రైతులు తమ భూమి అన్యాక్రాంత మైందని, ఈ విషయంలో రెవెన్యూ అధికారులు న్యాయం చేయడం లేదని ఫిర్యాదు అందజేశారు. అలాగే మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమకు ఎటువంటి ప్రాధాన్యం ఇవ్వడం లేదని అంతా టీడీపీ నాయకులు చెప్పినట్లే మండల అధికారులు నడుచుకుంటున్నారని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే పురోహితుని వలస మోడల్ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు సాయంత్రం పూట ఆర్టీసీ బస్సు సమయానికి రావడం లేదని పిల్లలు ఇబ్బందులకు గురవుతున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌సెల్‌కు 9 ఫిర్యాదులు

పార్వతీపురంటౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తున్నట్లు ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి 9 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌సెల్‌కు 56 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 56 వినతులు వచ్చాయి. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు ఇప్పించాలని సవర బొంతుకు చెందిన జ్యోతి కోరారు. చాకలిగూడకు చెందిన రాము అంగన్‌వాడీ భవనం మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. తాగునీటి బోరు మంజూరు చేయాలని భరణికోట గిరిజనులు వినతి ఇచ్చారు. కోదుల వీరఘట్టానికి చెందిన నీలకంఠం నాటు కోళ్ల ఫారం పెట్టుకోవడానికి రుణం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశాడు. కోసింగూడకు చెందిన నిర్మల కమ్యూనిటీ భవనాన్ని గ్రామంలో నిర్మించాలని వేడుకుంది. కార్యక్రమంలో ఏపీవో జి.చిన్నబాబు, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, పీహెచ్‌వో గణేష్, డిప్యూటీ ఈవో నారాయుడు, సీడీపీవో రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

54 ఫిర్యాదులు స్వీకరించిన డీఎస్పీ

విజయనగరం క్రైమ్: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’ ఎంతగానో ఉపయోగపడుతుందని విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి 54 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఎస్సైలు ఆర్.వాసుదేవ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్ కుమార్‌రెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ ఎస్.వీ మాధవ్ రెడ్డి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు

వినతులకు కచ్చితమైన సమాధానం

● కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్
● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 221 వినతులు

విజయనగరం అర్బన్: ప్రజా ఫిర్యాదుల విభాగానికి వచ్చిన వినతులకు నాణ్యమైన, కచ్చితమైన సమాధానాలు ఇవ్వాలని, రీ ఓపెన్ చేసే పరిస్థితి లేకుండా చూడాలని కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్ స్పష్టం చేశారు. వినతులు వచ్చిన రోజే అధికారులు ఓపెన్ చేయాలని, వినతులను పూర్తిగా చదివి అర్థం చేసుకుని అడిగిన దానికి కచ్చితంగా సరిపోయే సమాధానాన్ని ఇవ్వాలని ఆదేశించారు. వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని స్పష్టం చేశారు. ఎక్కువగా రెవెన్యూకు చెందిన వినతులే వస్తున్నాయని, తహసీల్దార్లు ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా అధికారులు, డివిజినల్, మండల అధికారులతో వినతులపై సమీక్షించారు. వినతులకు అసంపూర్తిగా, సంబంధం లేని సమాధానాలు ఇచ్చినా, గడువు దాటిన తర్వాత స్పందించినా, తప్పుడు లేదా తప్పుదారి పట్టించేలా సమాధానాలు ఇచ్చినా ఆయా శాఖల అధికారులపై చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. విజయనగరం జిల్లాకు చెందిన వినతుల రీ ఓపెన్ 1 శాతం ఉందని, వచ్చే వారం నుంచి రీ ఓపెన్ కేసులు జీరో కావాలని స్పష్టం చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్డీ అనిత ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 221 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంబంధించి రెవెన్యూ శాఖకు అత్యధికంగా 151, వినతులు అందాయి. పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డీఆర్డీఏకు 18 వినతులు అందాయి. మున్సిపాలిటీకి 14, పంచాయతీ శాఖకు 12, విద్యాశాఖకు 8 వినతులు అందగా మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి.

ఉత్సవ ఏర్పాట్లపై వేదిక వారీగా తనిఖీ

విజయనగరం ఉత్సవాల సందర్భంగా నగరంలో నిర్వహించనున్న వేదికల వారీగా చేస్తున్న ఏర్పాట్లపై మంగళవారం ఉదయం తనిఖీ చేయనున్నట్లు కలెక్టర్ అధికారులకు చెప్పారు. ఆయా వేదికల ఇన్‌చార్జ్‌లందరూ వారికి కేటాయించిన వేదికల వద్ద నివేదికలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

2న ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీలు

విజయనగరం: గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈనెల 2న ఏపీ ఇనిస్టిట్యూట్ విజయనగరం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కన్నబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఐదుగురు ఒక గ్రూపుగా పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి వరుసగా రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు తమ పేర్లను ముందుగా ఫోన్ 6281857100, 8501084358 నంబర్‌లకు కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి అరికట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి మాద క ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ మదక ద్రవ్యాల రవాణా, నివారణకు పోలీసు, ఫారెస్టు, ఎక్సైజ్ శాఖలతో సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరా లు, కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే అనర్థాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలని తెలి పారు. విద్యాసంస్థల్లో కూడా మత్తు పదార్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యా సంస్థల సమీపంలో ఉన్న షాపుల్లో తనిఖీలను నిర్వహించాలని, నూతన మద్యం పాలసీ అమలుకు మద్యం దుకాణాల కేటాయింపు సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలించడమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. మారుమూల అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు చేయకుండా అటవీ శాఖ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందేలా చూడాలని కోరారు. అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్ మాట్లాడుతూ అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో తనిఖీలను నిర్వహించి ఈ ఏడాది ఇంతవరకు 22 కేసుల్లో 276 కేజీల గంజాయిని పట్టుకుని 44 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పాలకొండ డీఎస్పీ రాంబాబు, జిల్లా అటవీ అధికారి జీపీపీ ప్రసూన, వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం. వినోద్ పాల్గొన్నారు.